కందకాల కబ్జాతో వరద గండం



- ప్రతీ ఏటా వానాకాలంలో ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం
- ప్రమాదపుటంచులో స్వర్ణ వాగు, జౌళినాలా పరివాహక ప్రాంతాలు
- చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపుతో జీఎన్ఆర్ కాలనీకి ముప్పు తప్పేనా ?

నిర్మల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంను ప్రతీఏటా వర్షాకాలం వణికిస్తోంది. ముఖ్యంగా నిర్మల్‌లోని అనేక చారిత్రక కందకాలు, నాలాలు, చెరువు భూములు కబ్జాకు గురవుతుండటంతోనే ప్రతీఏటా వరద నీరు పట్టణంలో బీభత్సం సృష్టిస్తోంది. గంటపాటు ఏకధాటిగా వర్షం పడితే చాలు జిలా కేంద్రమంతా జలమయమై పోతోంది. స్లమ్ ప్రాంతాలతో పాటు హైటెక్ కాలనీలు అలాగే హైవే ప్రధాన చౌరస్తాలు వర్షాకాలంలో వాననీటితో చెలగాటమాడుతుండడం సహజంగా మారిపోయింది. నిర్మల్ చుట్టూరా ఉన్న గొలుసుకట్టు చెరువులతో పాటు వాటికి ఆనుకొని ఉన్న కందకాలు అలాగే ప్రధాన నాలాలను ఆక్రమణదారులు పూడ్చి వేయడంతో ప్రస్తుతం అన్ని చిన్న మురికి కాలువలు, కుంటలుగా మారిపోయాయి. దీంతో వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం కారణంగా ఈ మురికి కాలువలన్నీ నిండిపోయి నీరంతా రోడ్ల పైనే కాకుండా ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తోంది. వర్షాకాలంలో నిర్మల్ పటట్ణం ఎటు చూసినా జలమయంగా మారిపోతోంది.

జీఎన్ఆర్ కాలనీకి ముప్పు తప్పేనా ?

జిల్లాకేంద్రంలోని సిద్దాపూర్ వరకు ప్రవహించే స్వర్ణకాలువ పరివాహకంలో ఉన్న జీఎన్ఆర్ కాలనీ వాసులు వర్షాకాలం పేరెత్తితేనే మొన్నటి వరకు గడగడలాడిపోయేవారు. గత రెండు సంవత్సరాల కిత్రం స్వర్ణ ప్రాజెక్టు గేట్లను ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఎత్తేయడంతో ప్రాజెక్టు వరద ఈ కాలనీని ముంచెత్తి దాదాపు పదిరోజుల పాటు ఈ కాలనీ జలమయమైపోయిన విషయం తెలిసిందే. ప్రజలను వరద నీటి నుండి కాపాడేందుకు పట్టణ ప్రజలు, అధికార యంత్రాంగమంతా శ్రమించాల్సి వచ్చింది. నీళ్లలో చిక్కుకుపోయిన ప్రజలను నాటు పడవలతో సురక్షిత ప్రాంతానికి తీసుకు వచ్చారు. ఇళ్లల్లో విలువైన వస్తువులన్నీ వరదనీటిలో కొట్టుకుపోయాయి. దీంతో పాటు ఇళ్లల్లో వరదనీటి కారణంగా ఇసుక మేటలు వేయడంతో చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల స్వర్ణవాగులో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పేల్చి దాని ఎత్తు తగ్గించారు. ఎత్తు తగ్గించడంతో జీఎన్ఆర్ కాలనీకి వరద ముప్పు కొంతమేరకైనా తగ్గుతుందని భావిస్తున్నారు.



అన్ని వార్డులకు వరదగండం

అలాగే జిల్లా కేంద్రంలోని పాతబస్తీ గుండా ప్రవహించే జౌళినాలా కాలువతో పాటు కందకాలు, కుంటలు కూడా ఆక్రమణలకు గురి కావడం, అలాగే ఈ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయక పోతుండడంతో పాత బస్తీవాసులకు ప్రాణసంకటంగా మారు తోంది. దీంతో పాటు ఈ కాలువకు ఆనుకొని నివసిస్తున్న వారంతా క్రమంగా ఈ కాలువను ఆక్రమించడంతో దాని పరిమాణపు రూపురేఖలు మారిపోయాయి. ప్రతీఏటా వర్షాకాలంలో జౌళినాలా పొంగిపొర్లుతుండడం సాధారణమైపోయింది. దీని కారణంగా రామారావు బాగ్, బెస్తవార్‌పేట కాల్వ గడ్డ, రామ్‌మందిర్, షేక్ సాహెబ్‌పేట్, కుర్రన్నపేట్ ముంపుకు గురవుతున్నాయి. ధర్మసాగర్ చెరువు ఆక్రమణకు గురికావడమే కాకుండా దాని కింది ప్రాంతంలో పంట పొలాలు అన్నీ కనుమరుగైపోవడం, ఇళ్ల నిర్మాణాలు పెద్దఎత్తున జరగడంతో ప్రియదర్శిని నగర్, మస్తాన్ దుబ్బా, మంజులాపూర్ వార్డు లు వర్షాకాలంలో వరదనీటితో ముంపుకు గురవుతున్నాయి. వర్షాకాలంలో ప్రతిఏటా ప్రియదర్శిని నగర్‌లో దాదాపు మోకాళ్ల లోతుల్లోకి వరద నీరు ప్రవహించడంతో జనమంతా ఇళ్లకే పరిమితమైపోవాల్సిన పరిస్థితి ఏర్ప డుతుంది. అలాగే కంచరోని చెరువు కింద ఉన్న విద్యానగర్, ఆదర్శనగర్‌లు కూడా ప్రతి వర్షాకాలంలో ముంపు బారిన పడుతున్నాయి. నిర్మల్‌లోని ప్రధాన కందకం ఆక్రమణకు గురికావడంతో ఇంద్రానగర్, శాస్త్రినగర్, రవినగర్‌లు వర్షం నీటితో సతమతమవుతున్నాయి. అలాగే డాక్టర్స్‌లైన్ ప్రాంతం ప్రధాన రోడ్డు నీట మునిగి పోతోంది. దీంతో పాటు పల్లెచెరువు, గండి రామన్న, గుట్టల ప్రాంతం నుండి ప్రవహించే వరదనీటి కారణంగా విశ్వనాథ్‌పేట్, గాజులపేట, వైఎస్ఆర్ కాలనీలు వరద నీటితో ముంపు పాలవుతున్నాయి. ముఖ్యంగా కందకాలు, చెరువులు, కాలువలు కబ్జాల కారణంగానే వాటి రూపురేఖలు మారిపోయాయి. వరద నీటి ప్రవాహం రోడ్లపైన, ఇళ్లల్లోకి చేరుకొని వారం పది రోజుల పాటు జనాన్ని సతమతం చేస్తోంది.

ఊసే లేని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

కాగా అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో నిర్మల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందింపజేశారు. దాదాపు రూ.60 కోట్లతో రూపొందించిన ఈ ప్రతిపాదనలను అప్పటి కేంద్ర ప్రభుత్వానికి అందించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించేందుకు అప్పట్లో మున్సిపల్ అధికారులతో కమిటీని కూడా నియమించారు. అయితే నిధుల కొరత కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు అటకెక్కాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు కేవలం నాయకుల హామీలకే పరిమితమైపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

భయం భయంగా జౌళినాలా పరివాహక ప్రాంతాలు

నిర్మల్ పట్టణంలోని పాత బస్తీ ప్రాంతాన్ని జౌళినాలా కాలువ వెంటాడుతోంది. 25 ఏళ్ల క్రితం వరకు ఈ కాలువ ద్వారా స్వర్ణ ప్రాజెక్టు నీరు పంట పొలాల కోసం ప్రవహించేంది. క్రమంగా పట్టణ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలియడం, అలాగే కాలువకు ఆనుకొని ఉన్న వారంతా దీనిని ఆక్రమించడంతో ఈ కాలువ రూపురేఖలు మారిపోయాయి. ప్రాజెక్టు నుంచి ప్రవాహం నిలిచిపోవడంతో ఇది ప్రధాన మురికి కాలువగా మారిపోయింది. దాదాపు పదిహేను వార్డులలోని మురికి నీరు ఈ జౌళినాలా కాలువ గుండా ప్రవహిస్తోంది. దీంతో ఇది మరో మూసీ నదిగా మారిపోయిందని అంటున్నారు. ఈ కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం కారణంగా ఇందులో బురద పేరుకుపోయి చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మురికి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీని కారణంగా వర్షాకాలంలో వరదనీటితో పాటు మురికి నీరంతా రోడ్ల పైనే ప్రవహిస్తుండడమే కాకుండా ఇళ్లల్లోకి కూడా చేరుకుంటోంది. దీంతో ఈ కాలువ పరివాహకంలో ఉన్న ప్రజలంతా ముంపుకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న ఇప్పటి వరకు సంబంధిత అధికార యంత్రాంగం నిర్మల్ పట్టణాన్ని వరద ముప్పు నుండి కాపాడేందుకు ఎలాంటి పకడ్బందీ ప్రణాళిక రూపొందించపోవడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి.

రైతుతో దురుసుగా ప్రవర్తించిన ఏఎస్సై సస్పెన్షన్

నిర్మల్ కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల సందర్భంగా పాత ఎల్లాపూర్ గ్రామంలో ఓ రైతుపై దురుసుగా ప్రవర్తించిన ఏఎస్సైని సస్పెండ్ చేసినట్టు కలెక్టర్ బుధవారం తెలిపారు. సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారిన వీడియోను జిల్లా యంత్రాంగం పరిగణలోకి తీసుకుందని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 20 వరకు అన్ని మండలాల్లో నిర్వహించే సదస్సులకు రైతులు హాజరై తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. అధికారులంతా వారికి సహకరించాలన్నారు.

రైతులపై దౌర్జన్యం చేస్తే ఉపేక్షించం : కలెక్టర్

భూ భారతి సదస్సుల సందర్భంగా రైతులపై ఎవరైనా దౌర్జన్యం చేసినా, దురుసుగా ప్రవ ర్తించిన సంబంధితులపై కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం నుంచి సదస్సులు ప్రారంభించినట్టు తెలిపారు. 25 గ్రామాల్లో ఇప్పటి వరకు 1100కు పైగా దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించినట్టు వివరించారు. రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తే కఠినచర్యలు : ఎస్పీ



సెట్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ జానకిషర్మిల

నిర్మల్ కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసుసిబ్బంది ప్రజలు, రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని వారిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకీషర్మిల హెచ్చరించారు. ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌లో రైతుపై ఏఎస్సై ప్రవర్తించిన ఘటనపై ఆరా తీసినట్టు ఎస్పీ తెలిపారు. బుధవారం సంబంధిత అధికారులతో సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. నిర్మల్ పోలీస్ అంటే మీ పోలీస్ అనే నినాదాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 24 గంటలు పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాత ఎల్లాపూర్ ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జిల్లాలో ఎక్కడ పోలీసులు ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని వారితో స్నేహ, మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. వారి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేయాలి తప్ప దురుసుగా వ్యవహరించరాదన్నారు.

'సైబర్ క్రైమ్.. మహిళా భద్రత' పై అవగాహన



కడెం బస్టాండ్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఖానాపూర్ సీఐ

కడెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నారీశక్తి కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ సీఐ, కడెం ఎస్సై కడెం పోలీసుస్టేషన్ మహిళా సిబ్బందితో కలిసి బుధవారం కడెం బస్టాండ్ ఏరియా ప్రాంతంలో మహిళలకు సైబర్ క్రైమ్‌పై, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వేర్వేరు సంఘటనల్లో

ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి ఇద్దరి మృతి

- ముథోల్ మండలం ఎడ్‌బిడ్‌లో ఒకరు
- తానూర్ మండలం సింగన్‌గాం గ్రామంలో మరొకరు



ముథోల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గ్రామానికి చెందిన టి. ప్రవీణ్ (28) అనే యువకుడు ట్రాక్టర్ కింద పడి మంగళవారం సాయంత్రం మృతి చెందిన ఘటన తీవ్రవిషాదం నింపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ రైతుకు చేనులో ట్రాక్టర్ రోట వేటర్ పని చేస్తుండగా ట్రాక్టర్ పైన కూర్చున్న ప్రవీణ్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి రోటవేటర్‌లో చిక్కుకున్నారు. దీంతో వెంటనే గమనించిన డ్రైవర్ ట్రాక్టర్ ఆఫ్ చేసి చూసే సరికి ప్రవీణ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ట్రాక్టర్ యజమాని న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు శవాన్ని తరలించుటకు అడ్డుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగిన తర్వాతనే శవం పోస్టుమార్టంకు తరలించాలని పట్టుబట్టారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరువురిని సముదాయించారు. బుధవారం ఉదయం మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని ట్రాక్టర్ యజమాని చెప్పడంతో సమస్య సద్దుమణి గింది. దీంతో శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సింగన్‌గాం గ్రామంలో..

తానూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగన్‌గాం గ్రామంలో మంగళవారం రాత్రి ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి బాసర మండలం టాక్లీ గ్రామానికి చెందిన పిక్లేకర్ దత్తు(45) మృతి చెందినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం.... సింగన్‌గావ్ గ్రామానికి చెందిన సాయినాథ్ పొలంలో రోటవేటర్ చేస్తుండగా ట్రాక్టర్‌పై కూర్చున్న పిక్లేకర్ దత్తు ప్రమాదవశాత్తు రూటర్ కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య అనూషబాయి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఏఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మోటార్ సైకిల్, ట్రాక్టర్ ఢీ

- యువకుడికి గాయాలు
- కేసు నమోదు

నర్సాపూర్(జి), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మోటారుసైకిల్, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బాసర మండలం బాలాపురం గ్రామానికి చెందిన లక్ష్మీ నారాయణ(22) మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. నర్సా పూర్(జి) పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీనారాయణ మంగళ వారం సాయంత్రం తన మోటార్‌సైకిల్‌పై బాసర నుంచి పని నిమిత్తం నిర్మల్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో నర్సాపూర్ గ్రామం దాటిన తర్వాత సాయినగర్ తండాకు చెందిన జాదవ్ గంగాధర్ నడుపుతున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చి లక్ష్మీనారాయణరావు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణరావు మోటార్ సైకిల్ పైనుంచి కిందపడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది లక్ష్మీనారాయణ రావును చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం బుధవారం లక్ష్మీనారాయణరావు నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌లో ప్రమాదంపై దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తును స్వీకరించిన ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ట్రాక్టర్ డ్రైవర్ జాదవ్ గంగాధర్‌పై కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అభిలాష అభినవ్



బూరుగుపల్లి(కె)లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్నదే లక్ష్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని పొట్టపల్లి(బి), నర్సాపూర్(జి) మండలంలోని బూరుగుపల్లి(కే) గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. గ్రామస్థులు అందరూ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని తమ భూ సమస్యల వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. పొట్టపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రత్యక్షంగా రైతులను కలిసి వారి భూ సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల వివరాలు పరిశీలించి అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం బూరుగుపల్లి(కే) గ్రామానికి వెళ్లిన కలెక్టర్ అక్కడ జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం పొందనున్నాయని తెలిపారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రెండో విడత భూ భారతి సదస్సులు జరుగనున్నాయని తెలిపారు. గ్రామ సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత రిజిస్టర్లలో ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఇంతకు ముందు కలెక్టర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నర్సాపూర్ (జి) మండలంలో..

నర్సాపూర్(జి), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూ భారతి సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని చర్లపల్లి, బూరుగుపల్లి(కే) గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆమె స్వయంగా పర్యవేక్షించి, భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అందిస్తూ, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే భూ భారతి సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమికి సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించవచ్చని ఆమె వివరించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సరిచూసుకోవాలని, ఏమైనా తప్పులుంటే ఈ సదస్సుల్లో తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ... చర్లపల్లి గ్రామంలో 12 దరఖాస్తులు అందాయని, బూరుగుపల్లి(కే) గ్రామంలో ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టబద్ధంగా వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. చాక్‌పల్లి గ్రామంలో తెలుగు మీడియం పాఠశాలకు సంబంధించిన వివరాలపై మండల విద్యాధికారి (ఎంఈవో)తో చర్చించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. మౌలిక వసతులు, విద్యానాణ్యత పెంపుదలపై దృష్టి సారించాలని ఎంఈవోకి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో పోతకోటి శ్రీనివాస్, డీపీఆర్వో విష్ణు, తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ వాహిద్ ఉద్దీన్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌తో పాటు ఆయా గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బూరుగుపల్లి గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్

లోకేశ్వరం మండలం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్

లోకేశ్వరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్‌పెల్లి(బి) గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి వల్ల ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భూ సమస్యలను పరిష్కరించేందుకే ఈ చట్టం తీసుకువచ్చిందన్నారు. రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి వెంటనే పరిష్కరించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రాజ్, భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనందరావు పటేల్, ఎంపీడీవో రమేష్ కుమార్, లోకేశ్వరం తహసీల్దార్ సర్ఫరాజ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బోరిగాం గ్రామ సమస్యను వెంటనే పరిష్కరించాలి

- 10వ రోజుకు చేరిన రిలే దీక్షలు
- దీక్షలకు సంఘీబావం తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు

భైంసా, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, అధికారులు కాలయాపన విధానాలకు తావులేకుండా సత్వరమే డివిజన్ పరిధిలోని ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ డిమాండ్ చేశారు. గ్రామంలో తొలగించిన స్థలంలోనే బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో భైంసాలో బుద్ధ-అంబేద్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ మాట్లాడుతూ ముథోల్ నియోజక వర్గ ఎమ్మెల్యేతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు సమస్యను పరిష్కరించడంలో విఫలమవ్వడంతోనే గ్రామంలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.వీరంతా సరియైన రీతిలో స్పందించి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టి ఉంటే గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయే వారు కాదని, అల్లర్లు, గొడవలకు అస్కారం ఉండేది కాదన్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు చొరవ చూపి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో గ్రామస్తులు శాంతి, సంయమనాలతో వ్యవహరించుకుంటూ సమన్వయంతో సమస్య పరిష్కరించుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. బుధవారం నాటికి బుద్ధ-అంబేడ్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ చేపట్టిన రిలే నిరహార దీక్షలు పదవ రోజుకు చేరుకున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులతో పాటు పలు సంఘాల దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ తమ సంఘీభావాన్ని తెలిపాయి.



బుద్ధ-అంబేద్కర్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్

భార్య ఇంటికి తిరిగి రాదని

మనోవేదనతో భర్త ఆత్మహత్య



బొగడమీది గంగారాం (ఫైల్)

నర్సాపూర్(జి), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. భార్య ఇంటికి తిరిగి రాదేమోనన్న బెంగతో బొగడమీది గంగారాం(35) అనే వ్యక్తి మంగళవారం రాత్రి తన ఇంట్లోఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాంకు 14 సంవత్సరాల క్రితం వెంకూరు గ్రామానికి చెందిన మీనాతో వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితం సజావుగానే సాగుతూ వచ్చింది. అయితే గత నెల రోజుల క్రితం భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ గొడవల కారణంగా మీనా తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి గంగారాం తన భార్య తిరిగి వస్తుందని ఎదురుచూశాడు. కానీ నెల రోజులైనా ఆమె తిరిగి రాకపోవడంతో ఇక తన భార్య ఇంటికి రాదేమోనన్న భయం, జీవితంపై విరక్తితో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో గంగారాం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గంగారాం తండ్రి బొగడమీది గణపతి నర్సాపూర్ పోలీసుస్టేషన్‌లో తన కొడుకు ఆత్మహత్య గురించి దరఖాస్తు చేసుకున్నాడు. ఎస్సై సాయికిరణ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు మీనాతో పాటు కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. గంగారాం మృతితో కుస్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వడ్లకు నిప్పు పెట్టి.. రోడ్డుపై బైఠాయించి

కొనుగోళ్లలో జాప్యంపై రైతుల నిరసన



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రవీందర్

దిలావర్‌పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసలే అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు వర్షాలు తగ్గినా కొనుగోళ్లు మందకొడిగా జరగడం ఆగ్రహం తెప్పించింది. దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు ధాన్యాన్ని 61వ జాతీయ రహదారిపై పోసి నిప్పంటించి నిరసనకు దిగారు. సమాచారం తెలుసుకున్న దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్ హుటాహుటిన రైతుల వద్దకు చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రైతులు ససేమిరా అనడంతో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. నిరసన విరమించాలని రైతులను కోరారు. రైతులు ఎస్సై హామీతో నిరసన విరమించారు. జాతీయ రహదారిపై రాకపోకలు యధావిధిగా సాగాయి.

భూ భారతి రెండో రోజు 47 దరఖాస్తులు

దిలావర్‌పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యామపూర్, సముందర్‌పల్లి గ్రామాల్లో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. యామపూర్‌లో 35, సముందర్‌పల్లిలో 12 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం కాల్వ, రత్నాపూర్(కే), కొత్తూరు(డి), అర్లి(బి), చింతకుంట గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులుంటాయని తహసీల్దార్ పేర్కొన్నారు.

గాడిదకు అరుదైన శస్త్ర చికిత్స

వింత దూడకు జన్మనిచ్చిన గాడిద



గాడిదకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

ఆదిలాబాద్, జూన్4 (ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో ఈత ఈనేందుకు బాధపడుతున్న గాడిదకు పశువైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన మీనాబాయి పెంపుడు గాడిద పురిటి నొప్పులతో బాధపడుతుండగా వాహనంలో జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలకు తరలించా రు. వెంటనే పరిశీలించిన వైద్యులు గాడిదకు ప్రాణహాని ఉందని తెలుసుకుని యజమాని అనుమతితో శస్త్ర చికిత్సను చేపట్టారు. దీంతో గాడిద ఓ వింత దూడకు జన్మనిచ్చింది. దూడ తల భారీ సైజులో ఉండి, మిగితా అవయవాల ఎదుగుదల లేక పోవడంతో ఈతకు అవకాశం లేకుండా పోయిందని వైద్యులు తెలిపారు. అలాగే జన్మించిన కొద్ది సేపటికే దూడ మరణించింది. దీనిని శస్త్ర పరిభాషలో హైడ్రోసెఫాలస్ పిటస్ అని అంటారని, ఇది జన్యులోపం వల్ల జరుగుతుందని పశువైద్యులు పేర్కొన్నారు. గాడిద పాలును అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తున్నానని యజమాని మీనాబాయి తెలిపారు. సుమారుగా లక్ష రూపాయల విలువ గల గాడిద ప్రాణాలు కాపాడిన పశువైద్యులు డా.గజానన్, డా.దూద్‌రాం రాథోడ్, అసిస్టెంట్ డైరక్టర్ గోపికిషన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

సోనాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి):భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ అన్నారు. ప్రభుత్వం మంగళవారం నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభించగా అందులో భాగంగానే బుధవారం మండలంలోని గొల్లాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి భూ సమస్యలు అడిగి తెలుసుకుంటు వాటి పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సదవకాశాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్, ఏఈఓ ఉమా, పంచాయతీ కార్యదర్శి ఆమని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో గంగాసింగ్ రాథోడ్

నార్నూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం రెండో దశలో మంజూరైనా లబ్దిదా రుల స్వగృహానికి వెళ్లి ఖాళీ స్థలం వద్ద బుధవారం నార్నూర్ ఎంపీడీవో గంగాసింగ్ రాథోడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిహత్నూర్, ముక్తపూర్, నాగల్ కొండా గ్రామం పనులు ప్రారంభించినట్లుగా ఆయన పేర్కొన్నారు. వారి వెంట ఎంపీఓ సాయి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అందుబాటులో ఉంటాం : ఎస్పీ



కుట్టే శివాజి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచుతున్న జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్4 (ఆంధ్రజ్యోతి): పోలీసు కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ కుట్టేశివాజి అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతిచెందారు. బుధవారం సంజయ్‌నగర్‌లోని కుట్టేశివాజి అంత్యక్రియల కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొని పార్థివదేహానికి పూలతో నివాళులర్పించి కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా జిల్లా పోలీసుయంత్రాంగం అందుబాటులో ఉంటుందన్నారు. కుటుంబసభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం అత్యవసరంగా రూ.30వేలు జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణా కర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి పాల్గొన్నారు.

చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

ఆదిలాబాద్‌అర్బన్, జూన్4 (ఆంధ్ర జ్యోతి): మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకువచ్చిన వాటిని సక్రమంగా అమలు చేయని కారణంగా దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి అన్నారు. బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను నళినిరెడ్డి ఆవిష్కరించి నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టుతూ ఉద్యమాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమలు చట్టాలు తీసుకువచ్చినట్టు చెబుతున్న ప్రభుత్వాలు వాటిని సక్రమంగా అమలు చేయడం లేదున్నారు. దాని కారణంగా ప్రతి నిత్యం మహిళలపై దాడులు, అత్యచరాలు,హత్యలు పెరుగుతున్నాయాన్నారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందుకు మహిళలకు రెండువేలు ఇస్తామని ప్రకటించిందన్నారు. దానితో పాటే ఆసరా పెన్షన్, దివ్యాంగుల పెన్షన్‌ను పెంచి వెంటనే ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ పోరాడి సాధించామన్నారు. అదే విధంగా పార్లమెంట్‌లో కూడా 33 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ వ్యక్తులు పోలీసు సైరన్లు ఉపయోగించరాదు

● డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, జూన్4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వ్యక్తుల వాహనాలకు పోలీసుసైరన్ వినియోగించినట్లయితే వారిపట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తుల వాహనాలకు అధిక శబ్దం వచ్చేలా మోడిఫైడ్ హారన్, పోలీసు సైరన్లు ఉపయోగించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చీటింగ్ కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద వృద్ధులకు చిన్నపిల్లలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, వారు అనారోగ్యబారీన పడకుండా ఇలాంటి చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం వాహనాన్ని సీజ్‌చేశామని తెలిపారు.

3 నెలలు.. 1200ల మెట్రిక్ టన్నులు



రేషన్ షాపు ముందు పడిగాపులు కాస్తున్న లబ్దిదారులు

(5వ పేజీ తరువాయి)

కార్డుదారుడికి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు రెండు మూడు నిమిషాల పాటు సమయం పట్టేది. ప్రస్తుతం ఒక్కో కార్డుదారునికి 20 నుంచి 30 నిమిషాల వరకు సమయం పడుతుందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. దీంతో రేషన్ బియ్యం కోసం గంటల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఎదురవుతోంది. కొత్త సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడంతో ఒక్కో లబ్ధిదారుని నుంచి నాలుగైదు సార్లు బయో మెట్రిక్‌ను తీసుకోవాల్సి వస్తుందని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రేషన్ షాపుల్లోనే డీలర్లు విధులు నిర్వహించాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లోనైతే నెట్‌వర్క్ సమస్యలు తలెత్తడంతో మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. రోజంతా రేషన్ షాపుల వద్ద ఎదురు చూస్తున్న రేషన్‌ను తీసుకునే పరిస్థితులు లేవంటున్నారు.

19 గ్రామాలకు ఫుల్ కోటా

వర్షాకాల పరిస్థితులు, రవాణా సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని 19 గ్రామాలకు ఒకేసారి 3 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఎందుకంటే భారీ వర్షాలు కురిస్తే ఈ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇలా జిల్లాలోని 8 మండలాల్లో 19 గ్రామాలను కటాఫ్ గ్రామాలుగా గుర్తించి అధికారులు ముందస్తు చర్యలను చేపట్టారు. ఈ గ్రామాలకు చెందిన డీలర్లు ఒకేసారి 3 నెలలకు సంబంధించిన రేషన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. మిగితా రేషన్‌షాపులకు మాత్రం బియ్యం స్టాక్ పూర్తయిన కొద్ది సరఫరా చేస్తున్నారు. గతంలో వర్షాకాల సీజన్‌లో ఒకేసారి కుటుంబానికి సరిపడా రేషన్ సరుకులను నిల్వ చేసుకునే పరిస్థితి ఉండేది. అలాంటి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ఒకేసారి సరఫరా చేయడంతో మారుమూల గిరిజన గ్రామాలకు ఇబ్బందులు దూరమవుతున్నాయి. ఇక పై వర్షాకాలంలో రేషన్ సరుకుల కోసం ప్రమాదకరంగా వాగులు, వరదలను దాటే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

నెలంతా రేషన్ సరఫరా

ఈ సారి నెలంతా రేషన్ బియ్యాన్ని డీలర్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే మూడు నెలలకు ఒకేసారి రేషన్ బియ్యాన్ని సరఫరా చేయడంతో గడువులోగా పూర్తి చేయడం కష్టంగానే ఉంటుంది. దీంతో జూన్ 30 వరకు రేషన్ బియ్యాన్ని నిరంతరంగా సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో 1 నుంచి 17 వరకు రేషన్‌ను సరఫరా చేసి ఆ తర్వాత రేషన్ షాపులను మూసి వేసేవారు. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. జూన్ 30 వరకు రేషన్ డీలర్లు తప్పని సరిగా లబ్ధిదారులకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అందరికి జూన్, జూలై, ఆగస్టు మూడు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని అందించే అవకాశం ఉంటుంది. మళ్లీ సెప్టెంబరు మాసంలో రేషన్ బియ్యాన్ని తిరిగి సరఫరా చేస్తారు.

ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం

● వాజీద్‌అలీ, డీఎస్‌వో, ఆదిలాబాద్

జిల్లాలో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి సరఫరా చేయడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. డీలర్లు బియ్యాన్ని నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు పడకుండా స్టాక్ పూర్తయిన కొద్ది బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. 8 మండలాల్లో 19 గ్రామాలకు మాత్రం ఒకేసారి రేషన్‌ను సరఫరా చేయడం జరిగింది. ఈ నెల 30 వరకు కార్డుదారులు 3 నెలలకు సంబంధించిన రేషన్‌ను తీసుకునే అవకాశం ఉంటుంది.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్

భైంసా, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షకాలం ఆరంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గాను పట్టణ పరిధిలో పారిశుధ్య నిర్వాహణ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల ఇంచార్జీలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. సానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా మురికి కాలువల పూడిక తొలగింపులు చేపట్టాలన్నారు. ఎక్కడ కూడా మురికినీరు నిల్వ లేకుండా అపరిశుభ్ర వాతవరణం ఏర్పడకుండా చూడాలన్నారు. రెవెన్యూ విభాగం రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ఆస్తి పన్ను వసూళ్లనే ఇప్పటి నుంచే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందులో మున్సిపల్ మేనేజర్ గౌరిష్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారిణి అనురాధతో పాటు ఆయా విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

భైంసా, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల మ్యానిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్ బాబు, వికలాంగుల సంఘ జిల్లా ప్రతినిదులు బురుగుల రాజు, బోజారెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత విషయంలో బుధవారం భైంసా ఆర్‌డీవో కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా జనసేన , వికలాంగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర పదవీ కాలం పూర్తయినప్పటికి వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. పెన్షన్ రూ.6 వేల కు పెంపు కార్యరూపం దాల్చలేదన్నారు. సదరం క్యాంపుల నిర్వాహణ సక్రమంగా జరుగడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ఇకనైనా స్పందించి వికలాంగులకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలులోకి తీసుకరావాలని డిమాండ్ చేశారు.వికలాంగులందరికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి అంత్యోదయ కార్డులను పునరుద్దరించాలన్నారు. లేని పక్షంలో దశలవారీ ఆందోళనలకు శ్రీకారం చుడతామని వెల్లడించారు.

9న చలో నిర్మల్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకగారి భూమయ్య

నిర్మల్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ నాయక్‌పోడ్ తెగ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు సోమవారం రోజున చలో నిర్మల్ విజయవంతం చేయాలని నాయక్‌పోడ్ సంఘం రాష్ట్ర ఉపధ్యక్షులు వెంకగారి భూమయ్య అన్నారు. బుధవారం రోజున జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయక్‌పోడ్ తెగకు సీరియల్ నంబర్ కేటాయించాలని, నిర్మల్ జిల్లాలో 55,000ల జనాభా ఉన్న గుర్తింపు లేకపోవడం పట్ల సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగాలకు దూరంగా ఉన్నామని కలె క్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరేందుకే చలో నిర్మల్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రధానమైన తెగ నాయక్ పోడ్ తెగ అధికారులకు తెలియకపోవడం తాము ఎంత వెనుకబడి ఉన్నామో ఇప్పటికైనా కలెక్టర్ అర్థం చేసుకోవాలన్నారు. తమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, జాతర, సాంస్కృతిని, సాంప్రదాయ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మా కుల దైవమైన భీమన్న ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, జాతర ఏర్పాటుకు నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మన ఆదివాసి బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ అభ్యుదయ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా తుడుందెబ్బ కన్వీనర్ సాకి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకూర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్ లింగన్న, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కే. భీమేష్, ఉద్యోగుల సంఘంజిల్లా అధ్యక్షులు మేడిపల్లి రవి, కొప్పుల చిన్నయ్య, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై విస్తృత ప్రచారం చేయాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రచార రథయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చే దిశగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందాలు మరింత ప్రభావవంతంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో మాదక ద్రవ్యాల నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాల నియంత్రణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ చట్టాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఏర్పాటు చేసిన ప్రగతిరథం - ప్రజా చైతన్యం, ప్రచార రథయాత్ర వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల కారణంగా యువత భవిష్యత్తు అంధకారంలో నిత్యం నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 2న మాదక ద్రవ్యాల రహిత జిల్లా స్థాపన కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను గ్రామ స్థాయిలోను స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, వయోవృద్ధుల హక్కులు, బాల్య వివాహాల నివారణ, బాలకార్మిక నిషేధం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించాలని కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కళాకారులు సుదర్శన్, నాగరాజు, రఘునాథ్, లక్ష్మణ్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

వరాకాలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమలు చేపట్టాలి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను బుధవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజారోగ్య పరిరక్షణలో నిమగ్నమైన ప్రతిశాఖ సమన్వయంతో పనిచేయాలని, బాధ్యతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాధాన్యత గల ప్రాంతాల్లో డ్రైయిన్‌లు పూర్తిగా శుభ్రపరచాలని, నీటినిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే కార్మికులకు కనీసవేతనం చెల్లించాలని, పని ప్రమాణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మలేరియా దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాని ఆదేశించారు. గ్రామ, వార్డు వాలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు, బడిబాట కార్యక్రమం, చిన్న మరమ్మతులు, యూనిఫాం కుట్టింపు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, డీఈవో రామారావు, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్

దీర్ఘకాలంగా సీఎంఆర్ ధాన్యాన్ని సమర్పించని రైస్‌మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

నిర్మల్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా సీఎంఆర్ ధాన్యాన్ని సమర్పించని రైస్‌మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి చెందే సీఎంఆర్ (కస్టమర్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని దీర్ఘకాలంగా సమర్పించని రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాంటి బకాయిదారులైన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కొంతమంది మిల్లర్లకు నోటీసులు జారీచేసి, వారి ఆస్తులను గుర్తించి బ్లాక్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా బకాయిలు ఉన్న మిల్లర్లను గుర్తించి, వారి ఆస్తులను బ్లాక్ చేయడంతో పాటు బహిరంగ వేలం ద్వారా విక్రయించాల్సిందిగా సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి మిల్లర్లకు బ్యాంకులు ఎటువంటి రుణాలు మంజూరు చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే మండల స్థాయిలో విత్తనాల దుకాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నకిలీ విత్తనాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మావల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మావల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపీడీవో శంకర్ బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు ఎంబడి గంగా భవానికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సౌమ్య, మావల ఈవో దుర్గయ్య, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కో-ఆప్షన్ మెంబర్ రహీంఖాన్, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ దొగ్గలి ప్రమీల, రేడ్డ నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రేండ్ల రాజన్న, వేరే నడిపి గంగారెడ్డి, సుంకరి నవీన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్

సిరికొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. బుధవారం సిరికొండ మండలంలోని పొన్న, సోంపల్లి, గ్రామాల్లో రెండవ విడతలో మంజూరైనటువంటి ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ముందుగా పొన్న, సోంపెల్లి గ్రామాల్లో ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర సత్యవతి కోటేష్‌తో కలిసి ఆయన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకే ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఏఎంసీ వైస్ చైర్మన్ చౌహన్ శేషారావు, మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎస్సీసెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, మైనార్టీ చైర్మన్ ముస్తఫా, మాజీ ఎంపీటీసీ మాధవ్ పటేల్, జగతప్ ఈశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, సీనియర్ నాయకుడు షేక్ ఇమామ్, పంచాయతీ కార్యదర్శి, అరుణ్ కుమార్, ఎం.డి. రంజాన్, లక్ష్మణ్,మల్లేష్, సంజీవ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు బరంపూర్‌లో మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి గ్రామస్తులు భక్తుల సహకారంతో గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మూడురోజులుగా ఆలయంలో వేద పండితులతో యజ్ఞ కార్యక్రమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రాణప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. గురువారం ఉదయం ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన ప్రాణప్రతిష్ఠాపన నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్, వీడీసీ అధ్యక్షులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్


బొప్పారికుంట గిరిజన గ్రామం


అధ్వానంగా ఉన్న బొప్పరికుంట రోడ్డు

అధ్వానంగా మారిన బొప్పరికుంట రోడ్డు

● వర్షాకాలంలో తప్పని తిప్పలు
● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


తాత్కాలిక వంతెన కొట్టుకు పోయిన దృశ్యం

ఉట్నూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఉన్నా నడవలేని దుస్థితిలో బొప్పరికుంట గిరిజనులు కాలం నెట్టుకొస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఉట్నూర్ మండలంలోని కామాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బొప్పరికుంట గిరిజన గ్రామంలో 20 ఆదివాసీ గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయి. కామాయిపేట నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించిన అధికారులు ఒక చిన్నపాటి కాల్వ పై వంతెన కూడా నిర్మించారు. భారీ వర్షాలకు వంతెన తెగిపోవడంతో పాటు రోడ్డు కూడా పూర్తిగా చెడిపోయి కంకర తేలింది.

● వర్షాకాలంలో తప్పని ఇబ్బంది...

గత రెండేళ్లుగా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని తమ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఇటు చూస్తే రోడ్డు పూర్తిగా చెడిపోయి ఉండగా మత్తడిగూడ వైపు నుంచి వెళ్లాలంటే వాగు ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని గిరిజనులు పేర్కొంటున్నారు. ప్రతి యేటా వర్షాకాలంలో సరుకుల కోసం కాలినడకన వెళ్తున్నామని, కనీసం తమ గ్రామానికి ఆటో నడవడానికి కూడా రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఏవైనా వ్యాధులు సంక్రమిస్తే ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం కల్పించి తమకు ఇబ్బందులు తప్పించాలని గ్రామ గిరిజనులు వేడుకుంటున్నారు.

● బీటీ రోడ్డు నిర్మించాలి..

భీమ్రావు, బొప్పరికుంట



కామాయిపేట ప్రధాన రహదారి నుంచి తమ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలి.అదే విధంగా చిన్న కాలువలపై వంతెనలు నిర్మిస్తేనే తమకు ప్రయోజనంగా ఉంటుంది. ప్రతియేటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాము. ఐటీడీఏ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించాలి.


దంతన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించాలి: ఎమ్మెల్యే

ఉట్నూర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని దంతన్‌పల్లి రైతు వేదికలో నిర్వహించిన ఇందిరమ్మ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దంతనపల్లి, గన్‌పూర్, చెరువుగూడెం, నర్సాపూర్ జె గ్రామాలకు మంజూరు చేసిన 300 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిబిదారులందరూ నాణ్యతగా నిర్మించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. త్వరలోనే రైతు భరోసా నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం కార్యచరణ చేస్తుందన్నారు. రానున్న వర్షాకాలంలో ఖరీఫ్ పంటలు పండించడానికి ప్రతిరైతు నాణ్యత విత్తనాలను కొనుగోలు చేసుకుని పంటలు వేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు విత్తనాల నాణ్యత పరిశీలించడంతో పాటు ప్రతీ రైతు రశీదులు తీసుకోవాలన్నారు. రశీదు ఉన్న రైతులకు పంట దిగుబడి రానప్పుడు ఆయా కంపెనీ నుంచి నష్ట పరిహారం రాబట్టే అవకాశాలుంటాయని అన్నారు. ఈ సందర్భంగా దంతనపల్లిలో తినలే నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ వంశీ, కార్యదర్శి అరవింద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖయ్యుం, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నందం, మోబిన్ తదితరులు పాల్గొన్నారు.


కౌటా (బి) పాఠశాలకు పాఠ్యపుస్తకాలను అందిస్తున్న మండల విద్యాధికారి

పాఠశాలకు చేరుకుంటున్న పాఠ్యపుస్తకాలు

బోథ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు పాఠ్యపుస్తకాలు చేరుతున్నాయి. మండల విద్యాధికారి కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు రావడంతో మండల విద్యాధికారి హన్సేస్ పాఠ్య పుస్తకాలను తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో ఆయా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పుస్తకాలను తీసుకువెళ్తున్నారు. పాఠశాలను తెరచుకోక ముందే పుస్తకాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉండడంతో అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను ఇవ్వడం జరిగింది. ఇక విద్యార్థులకు అవసరమైన డ్రెస్సులను సైతం పాఠశాలలు ప్రారంభం దాక ముందే అందించాలని అధికారులు చర్యలు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థుల కోసం పల్లెబాట పట్టిన అధ్యాపకులు


ఇంటర్ విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్న అధ్యాపకులు

బోథ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించేందుకు కళాశాల అధ్యాపకులు గ్రా మాల బాట పట్టారు. ఉదయం నుండి పదో తరగతి ఫలితాలు జాబితా పట్టుకొని గ్రామాలకు వెళతున్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. అయితే ఇప్పటికే అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చేరిపోయారు. విద్యార్థినులు కస్తూర్బా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చేరిపోవడంతో ప్రభుత్వ కళాశాలలో తక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన సాగుతున్న విద్యార్థులు మాత్రం ప్రైవేట్ కళాశాల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే లెక్చరర్స్ మాత్రం ప్రైవేట్ విద్యాబోధన కంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా కొనసాగుతుందని అనుభవజ్ఞులైన లెక్చరర్ల చేత విద్యను బోధిస్తామని వివరిస్తున్నారు. పాఠశాలకు సెలవులు ప్రకటించడం ఉంది. లెక్చరర్స్ ప్రభుత్వ కళాశాలలో చేరాలని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఏది ఏమైనా ఈసారి లెక్చరర్స్ కళాశాలలో పెద్ద మొత్తంలో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తున్నారు.

జీవో నంబర్ 49తో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

● మాజీ ఎంపీ సోయంబాపురావు ● మంత్రి సీతక్కకు వినతి


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంపీ సోయంబాపురావు

ఆదిలాబాద్‌అర్బన్, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నంబర్ 49తో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. పులులకు, ఏనుగులకు రక్షణ ఇచ్చే అటవి అధికారులు మనుషులకు రక్షణ ఎందుకు ఇవ్వం లేదన్నారు. జీవో 49ను చూపించి అటవి అధికారులు ఆదివాసులను అడవుల నుంచి తొలగించే కుట్రలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 49 వల్ల ఆదివాసులను వారి వ్యవసాయ భూములను సాగు చేయకుండా చేస్తుందన్నారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జీ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ జీవో నెంబర్ 49తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమణకాండను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కచ్చితంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులకు న్యాయం చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారన్నారు.

మొరాయిస్తున్న టికెట్ మిషన్లు

● ఇబ్బందులు పడుతున్న కండక్టర్లు
● సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

ఉట్నూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) బస్సులలో టికెట్ ఇష్యూయింగ్ మిషన్స్ (టిమ్స్) పని చేయక పోతుండడంతో కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ఉన్నత అధికారులు టిమ్స్ మెషిన్లను సక్రమంగా కొనుగోలు చేయకపోవడం తోనే మాటి మాటికి చెడిపోతున్నాయని కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉట్నూరు ఆర్టీసీ డిపోలోని సూపర్ లగ్జరీ బస్సులకు కొత్త టీమ్స్‌లు కేటాయించిన అధికారులు పల్లె వెలుగు బస్సులకు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రం పాత టీంస్‌లనే వాడుతున్నారు. ఫలితంగా మార్గమధ్యంలో టీమ్స్‌లో చెడిపోయినప్పుడు కండక్టర్లు ఆ మార్గంలో ఉన్న స్టేజీలలో బస్సులను ఆపకుండా వెళ్ళిపోతుండడంతో బస్సుల కోసం ఆయా స్టేజీల వద్ద ఎదురు చూస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డీనరీ స్టేజీల వద్ద దింపే ప్రయాణికులను దింపుతున్న కండక్టర్లు కొత్త వారిని ఎక్కించుకోవడంలో మిషన్లు పనిచేయడం లేదని, వెనుక మరొక బస్సు వస్తుందని చెప్పి వెళ్ళిపోతుండడంతో ఉట్నూరు ఆర్టీసి డిపోకు నష్టాలు వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు ఉట్నూరు డిపోలో పాత బస్సులే ఉండడంతో కూడా ప్రయాణికులు ఈ బస్సులో ప్రయాణించడానికి ఇష్టపడడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉట్నూరు డిపో కొత్త టీమ్స్ కేటాయించాలని ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.


గుడిహత్నూర్‌లో రద్దీ ఉన్న బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మహోర్ బస్సును పునరుద్ధరించాలి

ఉట్నూర్ డిపో నుంచి ప్రతీరోజు ఉదయం ఆదిలాబాద్ వెళ్లి, ఉట్నూర్ వచ్చి ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని దత్తాత్రేయ క్షేత్రమైన మహోర్‌కు వెళ్లె ఆర్డీనరీ బస్సును ఆదిలబాద్ డిపోకు కేటాయించడం వల్ల ఉట్నూరు ప్రాంత ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా ఉట్నూరు డిపో నుంచి నడుస్తున్న మహోరు బస్సును ఉన్నత అధికారులు ఆదిలాబాద్ డిపోకు కేటాయించడం వల్ల ఉట్నూరు ప్రాంత ప్రయాణికులు ఆదిలాబాద్ వరకు వేరే బస్సులో వెళ్లి అక్కడి నుంచి మావూరు బస్సు ఎక్కాల్సి వస్తుంది. గతంలో ఉన్న విధంగా ఉట్నూరు డిపోకు లాభాలు తెచ్చే మాహూర్ బస్సును ఉట్నూరు నుంచి పునరుద్ధరించి డిపోకు నష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదేనని ప్రజలు అంటున్నారు. ఉట్నూర్ ప్రాంతంలోని ప్రజలకు పల్లె వెలుగుల ద్వారా రవన్న సౌకర్యాలు కల్పించాల్సింది పోయి ఉన్న సౌకర్యాలను ఎత్తివేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సైతం ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలోని రవాణా సౌకర్యం కలిగించే వీలున్న గ్రామాలకు పలె వెలుగులు ప్రారంభించాలని, ఉట్నూరు డిపోలో మరికొన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలని ఉట్నూరు నుంచి నిర్మల్, నిజామాబాద్ బస్సులు గుడిహత్నూర్ మీదుగా, అలాగే ఉట్నూర్ నుంచి కడెం ఖానాపూర్ మీదుగా నిర్మల్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరిన లాభం లేకపోవడంతో ఆర్టీసీ ఉన్నత అధికారుల తీరుపై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కి ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే భావిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నత అధికారులు ఉట్నూర్ డిపో నుంచి రదు చేసిన జస్సులను తిరిగి పునరుద్ధరించాలని, నిర్మల్, నిజామాబాద్, బాసర ప్రాంతాలకు బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆంధ్రజ్యోతి' పరిశీలన


పని చేయని టీమ్స్

భూభారతిలో రైతుల సమస్యలు పరిష్కారం

● కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణక్క

ఉట్నూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అంతేకాక త్వరగా సమస్య పరిష్కారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క తెలిపారు. బుధవారం ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని రెవెన్యూ అధికారులతో కలిసి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రైతులు కోర్టుల చుట్టు తిరిగే అవసరం లేదని అన్నారు. ఫారెస్టు భూములకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ఇందుకోసమే భూభారతి చట్టాన్ని, తీసుకొచ్చారని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. సదస్సులో పాల్గొన్న రైతుల భూ సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నవీన్ కుమార్, కారోబారి పత్తుసింగ్, మాజీ సర్పంచ్ సరిత శ్రీనివాస్‌జాదవ్, మాజీ ఉప సర్పంచ్ మారుతి గైక్వాడ్, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌జాదవ్, సునిల్‌జాదవ్, విశాల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



పులిమడుగులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రభుత్వ వికాసం ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

ఉట్నూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ వికాసం ఆశ్రమ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బాల బాలికలకు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాథోడ్ వికాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవమున్న ఉపాధ్యాయ బృందంచే విద్యనందించడం జరుగుతుందన్నారు. చెవిటి - మూగ(బధిర), బుద్ధి మాంధ్యత, అందులు, శిశుపాక్షిక పక్షవాతం, స్పీచ్ థెరపి, ఉచిత ఆడియో టెస్టు చేయడం జరుగుతుందన్నారు. ఈ వికాసం పాఠశాలలో బాల బాలికలకు ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, కాస్మోటిక్ చార్జీలు, భోజనం, వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు సదరం సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, పాస్ పోర్టు సైజుఫోటోతో స్కూల్లో లేదా 9440085818, 95535 73420 ఫోన్ నెంబర్లలో సంప్రదించి దరఖాస్తు ఫారం పొంది పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం


● నిండిపోయిన మురికి కాలువలు ● రోడ్లపైనే చెత్తాచెదారం ● పట్టణాల్లో పంచాయతీ సిబ్బంది


తలమడుగు మండలంలోని డోర్లి గ్రామంలో నిండిపోయిన మురికి కాలువ

జర దేఖో


డోర్లి గ్రామంలోని రోడ్లపైన చెత్తాచెదారం

తలమడుగు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ కొంతమంది అధికారులు నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంలో పెంచి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామ పంచాయతీని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టణాల్లో ఉంటూ చుట్టం చూపుల గ్రామాల వైపు వెళ్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికంగా ఉండాల్సిన పంచాయతీ అధికారులు ఉదయం 10 గంట లకు వెళ్లి మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి వెళ్తున్నారని విమర్శ లు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షంతో గ్రామాల్లో రోడ్ల పైన ప్రవహించిన మురికినీరుతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది పంచాయతీ సిబ్బంది ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో బిజీగా ఉండడంతో పారిశుధ్యంపై పట్టించుకోవడం లేదంటున్నారు. ఇక నైనా అధికారులు దృష్టి సారించి గ్రామీణ ప్రాంతాల్లో లోపించిన పారిశుధ్యాన్ని తొలగించే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల వాసుల కోరుతున్నారు.



క్రీడా పాఠశాలలో కోచ్‌ల నియామకానికి దరఖాస్తులు చేసుకోండి

ఉట్నూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో నెలకొల్పిన ఆదర్శ క్రీడా పాఠశాలలో కబడ్డీ, అథ్లెటిక్స్‌లలో అనుభవం ఉన్న కోచ్‌లు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు అయిన వారు ఈ నెల 11 లోగా దరఖాస్తులు డీడీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15న సర్టిఫికెట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం 944006 6442ను సంప్రదించాలన్నారు.

3 నెలలు.. 1200 మెట్రిక్ టన్నులు



జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

- రేషన్ బియ్యం కోసం ఎగబడుతున్న లబ్ధిదారులు
- సర్వర్ సమస్యలతో ఆలస్యమవుతున్న పంపిణీ
- 8 మండలాల్లో 19 కటాఫ్ గ్రామాలుగా గుర్తింపు
- జూన్ 30 వరకు సరఫరా చేయాలని ఆదేశాలు
- వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

ఆదిలాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేయడంతో డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. అయితే కొన్ని రకాల ఇబ్బందులు తలెత్తుతున్న నిరుపేదలకు ఒకేసారి 3 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం అందడంపై అంతటా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 356 రేషన్ షాపుల పరిధిలో లక్షా 92వేల 727 రేషన్ కార్డులు ఉన్నాయి. దీంతో ప్రతీనెల 400ల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అవసరం ఉంటుందని పౌర సరఫరాల అధికారులు చెబుతున్నారు. 3 నెలలకు గాను 1200ల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం జిల్లాకు రావాల్సి ఉంది. అయితే బుధవారం సాయంత్రం వరకు 410 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం జిల్లాకు సరఫరా అయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఒకేసారి రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తే నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో దశల వారీగా అధికారులు రేషన్ డీలర్లకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అయితే ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ జూన్ 1 నుంచి ప్రారంభం కావడంతో లబ్ధిదారులు రేషన్ కోసం ఎగబడుతున్నారు. దీంతో అన్ని రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు బారులు తీరుతున్నారు.

ఆలస్యమవుతున్న పంపిణీ

మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంలో పలు రకాల సమస్యలు ఎదురవుతున్నాయి. ఎందుకంటే సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేర్పులు చేయడం కొంత ఇబ్బందికరంగా మారిందంటున్నారు. గతంలో ఒక్కో

(మిగతా 6వ పేజీలో)



రేషన్ బియ్యం కోసం రేషన్ షాపు ముందు పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వినియోగించుకోవాలి

● సాత్నాల ఎంపీడీవో వెంకట్‌రాజ్



డోనలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వెంకట్‌రాజ్

జైనథ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లను సద్వినియోగం చేసుకోవాలని సాత్నాల ఎంపీడీఓ వెంకట్‌రావ్ అన్నారు. బుధవారం సాత్నాల మండలంలోని డోన గ్రామంలో అర్హులైన ఇందిరమ్మ పథకానికి సంబంధించిన 12 మందికి ఇందిరమ్మ మంజూరు పత్రాలు అందజేశారు. అర్హులకు మంజూరు చేసిన ఇండ్లను ప్రతిఒక్కరూ నిర్మించుకోవాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో డోన ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు, సాత్నాల మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి

● డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్‌రాథోడ్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్4 (ఆంధ్రజ్యోతి): 2027 నాటికి లెప్రసీ ఫ్రీ దేశంగా తయారు చేసేలా ప్రభుత్వాలు ప్రణాళికతో ఉన్నాయని వైద్య సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో దీనిపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్‌రాథోడ్ అన్నారు. బుధవారం లెప్రసీ కేసుల నమోదు పై నిక్షిత్ 2.0 పై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించారు. దీనికి డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా హైదరాబాద్ నుంచి వచ్చిన మాస్టార్ ట్రైనర్లు ఆపరేటర్లకు ఎలా ఎంట్రీ చేయాలో ప్రొజెక్టర్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్‌రాథోడ్ మాట్లాడుతూ లెప్రసీని పూర్తిగా అంతం చేసేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వైద్య సిబ్బంది అందరి సహకారంతో జిల్లాను లెప్రసీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషిచేయాలన్నారు. ఇప్పటికే ఎన్‌సీడీసీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. అదే తరహాలో లెప్రసీ కేసులను గుర్తించి వాటిని నిక్షిత్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఇందులో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేస్తున్న ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్

ఇంద్రవెల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామీణప్రాంత ప్రజల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడిమేత మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. వర్ష కాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సంభవించే అవకాశాలున్నాయని, గ్రామాల్లో పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో ప్రసవ సమయం దగ్గరున్న గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక రోగులను గుర్తించి ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించి బర్త్ వేటింగ్ రూమ్‌కు తరలించాలని సూచించారు. వర్షాకాలంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, పూజిత, నిలోఫర్ హెల్త్ సూపర్ వైజర్ సురేష్ వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

దన్నూర్ రోడ్డుపై ప్రమాదాల నివారణకు బారికేడ్ ఏర్పాటు



కొట్టుకుపోయిన వాగు వద్ద బారికేడ్‌ను ఏర్పాటు చేస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

బోథ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నురోడ్డుపై గత వర్షాకాలంలో కోతకు గురైన బ్రిడ్జివద్ద అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం ఆర్‌అం డ్‌బీ సిబ్బంది కొట్టుకుపోయిన వాగు వద్ద బారికేడును ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు నివారించే ఆస్కారం ఉందని గ్రామాల వారు అంటున్నారు. రాత్రి పూట కనిపించే విధంగా రేడియం ఇరువైపులా అతికించినట్లయితే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

●ఇచ్చోడ సీఐ బండారి రాజు

ఇచ్చోడ, జూన్4, (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన నాణేల పేరుతో కొందరు వ్యక్తులు మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. బుధవారం పక్కా సమాచారం మేరకు ఇచ్చోడలో తనిఖీలు నిర్వహించగా.. అనుమానిత వ్యక్తి వద్ద వన్ అనాకాయిన్ లభించిందని ఆ కాయిన్‌ను స్వాధీన పరుచుకుని దర్యాప్తు కొనసాగుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాచీన నాణేలు అని చెప్పి నమ్మించి సాధారణ ప్రజలకు ఆ నాణేలను అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రాచీన కాయిన్‌లు అంటూ మోసం చేసే అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.



అనుమానిత వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ప్రాచీన కాయిన్

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

● కలెక్టర్ రాజర్షి షా



పిప్రిలో మహిళలకు స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, జూన్4 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారికి బుధవారం భూమిపూజ చేశారు. గుణపంతో మట్టిని తవ్వి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిప్రి గ్రామంలోని రైతువేదిక భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధనతో పాటు కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో మాత్రమే చేర్పించాలన్నారు. ప్రైవేటు బడులకు పంపవద్దని మీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి మీ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన 33 మంది మహిళలకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.



పిప్రిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆ రాజకీయ కుటుంబీకులు ఎస్టీలు కాదు

● ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, జూన్4 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో 20ఏళ్లుగా ఎస్టీ రిజర్వుడ్ స్థానంలో ఎస్టీ పేరుతో రాజకీయం చేసిన చౌహన్ దేవానంద్ కుటుంబీకులు ఎస్టీలు కాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంచలన ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఏజెన్సీ కేంద్రమైన ఇచ్చోడ మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా దేవానంద్ కూతుళ్ల చౌహన్ ప్రమీల, చౌహన్ సునీతలు మూడు సార్లు (15 ఏళ్లు), దేవానంద్ ఎంపీటీసీగా (5 ఏళ్లు) రాజకీయాల్లో ఉన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బంజారా సంఘ నాయకులు దేవానంద్ కుటుంబీకులు ఎస్టీ కాదని గత మూడు నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు ఇటీవలే నివేదికను అందజేశారు. దీంతో చౌహన్ దేవానంద్ కుటుంబీకులు ఎస్టీలు కాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గత నెల 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేయగా.. బుధవారం వెలుగులోకి వచ్చింది. చౌహన్ దేవానంద్‌తో పాటు ఇతని కుటుంబంలోని ప్రమీల, సునీత, అనిత, గోవింద్, అనిల్, అశోక్‌లు.. మొత్తం ఏడుగురు నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు పొందారని, వీరు ఎస్టీలు కాదని కలెక్టర్ తెలిపారు. ఏజెన్సీ పేరిట చౌహన్ దేవానంద్ భూముల క్రయవిక్రయాలు చేసినందు వల్ల ఆయా భూములపై కూడా విచారణ చేపట్టి రికవరీ చేయాలని ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. 30రోజులలో దీనిపై అప్పీల్‌కు వెళ్లేందుకు కలెక్టర్ వీరికి అవకాశం కల్పించారు. మరో వైపు.. ఈ మొత్తం వ్యవహారం ఇచ్చోడలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఎక్కడ చూసినా.. ఇదే విషయమై చర్చ కొనసాగుతోంది.

కౌటా(బి)లో కుంట ఆక్రమణపై గ్రామస్తుల ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి

బోథ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఆర్ఐ సునీతరికార్డు అసిస్టెంట్ నందయ్యతో పాటు వైద్యసిబ్బంది ఆశా వర్కర్లు గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులను నిర్వహించామన్నారు. ప్రజలు పట్టాదారు పాస్‌బుక్‌లో దొరలిన తప్పులను ఇంకేమైనా భూసమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు సమస్యను దరఖాస్తు చేసుకుంటే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కాగా గ్రామంలో నిర్మించిన కుంట భూమి విక్రయించిన ఓ రైతు తాను భూమిని విక్రయించలేదంటూ పేర్కొనడం సరైనది కాదని గ్రామస్తులు తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అంతేగాక రైతు భూమి విక్రయించినట్టు బాండ్ పేపర్‌పై రాసి ఉన్న విక్రయించిన రైతు గ్రామస్తులను తప్పుదోవ పట్టించడంతో పాటు అధికారులను సైతం తప్పు దోవ పట్టిస్తున్నారని గ్రామ మాజీ ఉపసర్పంచ్ చిలకాడి రవీందర్ పేర్కొన్నారు. అయితే కుంట ఆక్రమణ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని వీడీసీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మల్లెపూల రమేష్‌లు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. కాగా సమావేశంలో పలువురు రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు.

భూభారతి చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారం

● సాత్నాల తహసీల్దార్ మడావి విశ్వనాథ్

జైనథ్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూసమస్యలను పరిష్కరించవచ్చని సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్ అన్నారు. బుధవారం సాత్నాల మండలంలోని డోన గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 25 మంది రైతులకు సంబంధించిన అటవీహక్కుల చట్టం కింద గిరిజన రైతుల భూ సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో సాత్నాల మండల రెవెన్యూ సిబ్బంది, డోన గ్రామ ప్రజలు, గిరిజనులు పాల్గొన్నారు.

తలమడుగు: భూ సమస్యలు పరిష్కరించడానికి భూభారతి నూత న రెవెన్యూ చట్టం ప్రభుత్వం అమలు పరచిం దని వీటిని రైతులు సద్వినియో గపరుచు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామల దేవి కోరారు. రెవెన్యూ సదస్సులో భాగంగా బుధ వారం మండలంలోని మారుమూల ఆదివాసి గ్రామమైన ఉమ్రి గ్రామ పంచాయతీలో నిర్వ హించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొ న్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడు తూ దీర్ఘకాలికంగా కొన్ని గ్రామాల్లో భూ సమ స్యలు పరిష్కారం కాక రైతులు గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పథకాన్ని ప్రారంభించి ప్రతి గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల. ప్రజల భూ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులకు హాజరై భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆదివాసి గ్రామాల్లో వారికి ఎలాంటి భూ సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

కాగా ఉమ్రి, దేగామా గ్రామాల్లో ఆదివాసి గిరిజనులు గత 25-30 సంవత్సరాల క్రితం భూములు కొనుగోలు చేసినప్పటికీ వారి కి పట్టా పాస్‌బుక్ లేక ఇబ్బందులు పడు తున్నామని గ్రామస్తులు రైతులు అధికారులకు విన్నవించగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మం డలంలోని అర్లికే గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మోహన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, సిబ్బంది సాయి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



కౌట(బి) గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సులో పాల్గొన్న తహసీల్దార్ రైతులు